మనిషి మైనస్ మమత

త్రి. విజయలక్ష్మి

'రండిరా, రండి. కలేజా వుంటే రండి. మీరు ముగ్గురు, నేనొక్కడ్ని. ఐనా రే. స్టై. నా చేతిలోదేమిటో తెలుసుగా. త్త బ్లేడు. జామపండును కోసినట్లు సేస్తాను. రండి' అంటూ బ్లేడును ట్టుకున్న చేతిని గాలిలోకి విసుర్తున్నాడు పాల్. అతనిచేయి తమకు తగలకుండా గ్రత్త పడుతూ అతన్ని ఎలాగైనా ంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు జు, శీను, రమేశ్. ముగ్గురూ మూడు పులనుంచీ గోపాల్‌మీదికి వస్తున్నారు. రికందకుండా వెనక్కు నడుస్తూనే ్లేడును గాలిలోకి విసురుతూ వారి గమ న్ని నిరోధిస్తున్నాడు గోపాల్. అతను ెనకడుగు వేయడం వారి ముగ్గురిలో త్సాహాన్ని పెంచింది. సమయం చూసి తనిమీద పడటానికి పట్టుదలగా ముందుకు స్తున్నారు.

గోపాల్‌కు చేయినొప్పి పుడుతోంది. వారి ారినుండి ఎలా తప్పించుకోవాలో అతనికి ోచడంలేదు. అతనికున్న రామబాణమల్లా దొక్కటే. తనమీద కలబడ్డానికి ఎవరైనా స్తుంటే జేబులోని బ్లేడును బయటకు తీసి దానితో ప్రత్యర్థిని చీరేస్తానంటూ గాలిలో విన్యాసాలు చేస్తాడు. ఆ బ్లేడుకు దడిసి ఎవరూ అతనితో తలపడేవారు కాదు. కాని ఈ నాడు రాజు, శీను, రమేశ్ బ్లేడుకు భయపడకుండా తనమీదకు వస్తుంటే ఏం చేయాలో తోచడంలేదు గోపాల్‌కు.

మరో పదినిమిషాలు గడిస్తే గోపాల్ చేతిలోని బ్లేడు ప్రత్యర్థుల శరీరాల్ని చీరేదో లేక ఆ ముగ్గురూ గోపాల్‌మీదపడి అతడ్ని పచ్చడిచేసేవారో తెలీదుగాని, అప్పడే వచ్చిన వాళ్ల టీచర్ విశ్వనాధంగారు కలుగ జేసుకోడంతో అప్పటికా యుద్ధకాండ ఆగింది.

'ఏమిటోయ్ ఇది? మీరు విద్యార్థులా, యుద్ధార్థులా' నవ్వుతూ ప్రశ్నించారు విశ్వ నాధంగారు.

'చూడండి సార్. నా టెర్లిన్‌షర్టును ఎలా చింపాడో చూడండి. ఇంటికి వెళ్తే మావాళ్లు నన్ను చితుకపొడుస్తారండి' శీను చీరికలైన టెర్లిన్‌షర్టును చూపించాడు.

'నిజమేనా గోపాల్? ఎందుకలా చేశావ్?'

గోపాల్ మౌనంగా నిల్చున్నాడు.

ఇదివరకొకసారి క్లాసులో తనముందు కూర్చున్న విద్యార్థి చొక్కానిండా గోపాల్ సిరా చల్లిన సంఘటన గుర్తువచ్చింది విశ్వ నాధంగారికి. ఆరోజూ ఇలాగే నిల్చున్నాడు గోపాల్.

'అసలు నీకా బ్లేడెందుకు చేతిలో?' విశ్వ నాధంగారు మళ్లీ ప్రశ్నించారు.

'వాడిదగ్గర అది ఎప్పుడూ వుంటుం దండి. దాంతోటి స్కూల్లో డెస్కును, బ్లాక్‌బోర్డును, సినిమాకు వెళ్లినప్పు డక్కడి సీట్లను కోస్తుంటాడండి' రాజు అన్నాడు.

విశ్వనాధంగారు ఆశ్చర్యపోయారు. నిండా పన్నెండేళ్లు లేని ఈ గోపాల్ ఇన్ని విధ్వంసక చర్యలు చేస్తున్నాడేమిటా అనిపించింది.

'తప్పు గోపాల్. అలా చేయవచ్చునా. ఏ వస్తువునైనా నాశనం చేయడం చాలా తేలిక. కాని బాగుచేయడమంటే ఎంత శ్రమపడాలో, ఎంత వ్యయమౌతుందో ఆలో చించు. శీనూ, మీ నాన్నగారికి నేనెలాగో నచ్చచెప్పి నీకు మాట రాకుండా చూస్తాను. నీవుమాత్రం గోపాల్ ఈపని చేశాడని ఇంట్లో చెప్పకు. వెళ్లు. రాజూ! రమేశ్!

మీరుకూడా వెళ్ళండి.'

వాళ్ళటు వెళ్ళగానే తనలోతను అనుకున్నట్లుగా అన్నాడు గోపాల్. 'ప్రతిరోజూ తనే టెర్లిన్‌షర్టు వేసుకొస్తున్నానని మహా నీల్గుతున్నాడు. తిక్క కుదిరింది '

ఆ మాటల్ని విశ్వనాథంగారు విన్నా విననట్లే ఊరుకున్నారు

'మీ ఇల్లెక్కడ గోపాల్?'

'ప్రక్కవీధిలో మొదటిల్లే సార్.'

'అలాగా, పద నేనూ అటే వస్తున్నాను '

* * *

ఆ మర్నాడు—

సరిగా అదే సమయం, సాయంత్రం ఆరు గంటల సమయం—

రోడ్డుమీద నడుస్తున్న విశ్వనాథంగారు గోపాల్ ఇంటివైపు చూశారు. అక్కడి దృశ్యం ఆయన్ను చకితుణ్ని చేసింది. ప్రహరీగోడకు బదులుగా నిల్చిన వెదురు కర్రల తడికసందులనుంచి కన్పించాడు లోపల వరండాలో నిల్చున్న గోపాల్ అతని శరీరంపై వెదురుబెత్తం నాట్యం చేస్తోంది. ఆ దెబ్బలకు అతను ఏడవటంలేదు. పైగా కోపంగా, నిర్లక్ష్యంగా చూస్తున్నాడు. ఎదురు తిరగాలని ప్రయత్నం చేస్తున్నాడు. స్త్రీది జాలిగుండె అని, మెత్తని మనసని భావించే విశ్వనాథంగారు గోపాల్‌ను కొడుతున్న ఆ స్త్రీనిచూసి విస్తుపోయారు.

'ఏమండి, ప్లీజ్, ఆగండి. ఎందుకలా కొడ్తారతన్ని?'

'ఎవరు మీరు? ఎందుకొచ్చారిక్కడకు? మీదారిన మీరు వెళ్ళలేరూ?'

'వెళ్ళలేక కాదమ్మా. కావాలనే వచ్చాను. గోపాల్ నా స్టూడెంటు. అతను అనుభవిస్తున్న శిక్ష ఏ నేరానికో తెలుసుకో వచ్చా?'

'వాడకి టీచరు కదా మీరు, తప్పకుండా తెలుసుకోవాలి. స్కూలునుంచి వచ్చేవాడు బుద్ధిగా ఇంట్లోకి రావచ్చునా? ఆహా అలా రాకుండా గుమ్మందగ్గర నిలబెట్టిన స్కూటర్ టైరును సూదితో పొడిచి లోపలికొచ్చాడు. గాలిపోయిన స్కూటరును నడిపించుకపోవడం ఎంతకష్టం? ఇంటికొచ్చిన పెద్దమనిషికి ఇదేనా చేసే మర్యాద?'

విశ్వనాథంగారు క్షణంసేపు ఆలోచించారు నిన్న గోపాల్ శీను టెర్లిన్‌షర్టును ఎందుకు చీలికలు చేశాడో అర్థమైంది — తనకు టెర్లిన్‌చొక్కాలు లేవని, తోటివాడు రోజూ ఆ టెర్లిన్‌చొక్కాలు తొడిగి గొప్పలుపోతున్నాడని. మరి ఈనాడు గోపాల్ స్కూటరు టైరుకు బెజ్జం పొడిచిందెందుకు? తనకు స్కూటర్ లేదనా? కారణం సబబుగా తోచలేదు ఆయనకు. మరో కారణమేదో ఉండివుండాలి అనిపించింది.

'లెటిట్‌గో సరూ. డోన్ట్‌మేక్ మచ్ ఫస్ ఆఫిట్,'

ఆ మాటలనిన వ్యక్తిని చూశారు విశ్వనాథంగారు. ఆ వ్యక్తే స్కూటర్ సొంతదారయి వుంటాడని గుర్తించారు. పాతికేళ్ళ అతను ఎర్రగా, అందంగా సూట్ వేసుకుని వున్నాడు.

విశ్వనాథంగారు 'సరూ'ని చూశారు. ఎర్రగా కందిన మొహంతో ముక్కుపుటాలెగిరిపడేటట్లు శ్వాసను వేగంగా పీలుస్తోంది. అపరకాళిలా వుందామె. ఆమె మెడలో ఒంటిపేట బంగారం గొలుసు మాత్రం వుంది

'వీరు మీ...'

అర్థోక్తిలో ఆగిపోయిన విశ్వనాథంగారి వేపు కొరకొరా చూస్తూ 'ఫ్రెండ్' అన్నదామె.

'మీకు అభ్యంతరం లేకపోతే గోపాల్‌ను నాదగ్గరకు ట్యూషనుకు పంపండి కొన్నాళ్ళు' అన్నారు విశ్వనాథంగారు.

'వాణ్ని బాగుచేద్దామనుకుంటున్నారేవిటి? అలాంటి ఆశ పెట్టకోకండి. పైగా వాడి శని మీకూ పట్టుకుంటుంది '

'శనేమిటి?'

'వాడుత్త నష్టజాతకుడు మేష్టారూ! పుట్టకుండానే తండ్రిని చంపేడు, పుట్టి తల్లిని మింగేడు. చదువు వంటబట్టించుకోకుండా నా జీవితానికి గుదిబండలా తయారయ్యాడు' గోపాల్ వీపుపై మళ్ళీ ఒహటి తగిలించిందామె

'నాకా నమ్మకాలేవీ లేవు లెండి...'

* * *

అప్పుడే స్కూలు ఆవరణదాటి బయటకొచ్చారు విశ్వనాథంగారు. స్కూలుబయట పెద్దపెద్ద చెట్లున్నై. ఒక చెట్టుక్రింద ఒంటరిగా కూర్చుని ఉన్నాడు గోపాల్! 'ఈరోజు ఎవరితోనూ తగవుపెట్టుకోకుండా ఒంటరిగా కూర్చున్నాడేమిటి చెప్మా' అని ఆశ్చర్యపోయారు విశ్వనాథంగారు.

గోపాల్ చెట్టుక్రింద కూర్చుని చేస్తున్నదేమిటో చూడాలనిపించి మెల్లగా చెట్టుక్రిందకు నడిచారు విశ్వనాథంగారు. గోపాల్ బ్లేడుతో చెట్టుమొదట గంటుపెడుతున్నాడు. ఆ గంటు చాలా పెద్దదిగా వుంది ఒక్కసారిగా పెట్టినది కాదది. బహుశః అతను తీరిక దొరికినప్పుడల్లా ఆ గంటును కొద్దికొద్దిగా పెద్దది చేస్తూ ఉండివుంటాడనిపించిందాయనకు.

'ఏం గోపాల్! ఒంటరిగా కూర్చున్నావ్?'

విశ్వనాథంగారి పిలుపుకు ఉలిక్కిపడి బ్లేడును జేబులో వేసుకున్నాడు 'అబ్బే .. లేదండి. ఊరికనే కూర్చున్నాను ' తను పెడుతున్నగంటు విశ్వనాథంగారికి కన్పించకుండా దానిమీద కూర్చున్నాడు గోపాల్.

'గోపాల్ పెద్దవాడైనా అతనికి ఈ బ్లేడును ఉపయోగించే అలవాటు పోదేమో. కొంపదీసి మనిషి గొంతుకల్ని కోసేయుడు గదా' ఆ ఆలోచన రాగానే విశ్వనాథంగారు భయపడిపోయాడు

'పొద్దుగూక వస్తోంది, ఇంటికిపోదాం రా గోపాల్!'

గోపాల్ ఇబ్బందిగా మొహం పెట్టేడు. కొంచెంసేపు తటపటాయించి, 'ఇవాళ మా అక్క ఇంటికొచ్చేసరికి ఆలస్యమౌతుంది. కాసేపు ఇక్కడే కూర్చుని వస్తానండి' అన్నాడు. విశ్వనాథంగారు 'సరే' నంటూ నడక సాగించారు.

గోపాల్ ఇంటివద్దకు రాగానే అలవాటుగా లోపలికి చూశారు విశ్వనాథంగారు. వరండాలో 'సరూ' కూర్చుని వుంది. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుగా వున్నదామె వైఖరి 'తన ఫ్రెండ్‌కోసమేమో' ననుకుంటూ నడుస్తున్నారు విశ్వనాథంగారు.

'మేష్టారూ! మేష్టారూ! వన్ మినిట్. మీ శిష్యుడింకా రాలేదేమండి' ఆమె వీధి వాకిలివరకూ వచ్చి అడిగింది.

'స్కూలుదగ్గర కూర్చొనున్నాడు. మీరివాళ ఆలస్యంగా ఇంటికొస్తారని చెప్పాడే.'

'ఓరి దొంగరాస్కెల్. రానీండి వాడి ప్రాణం తీసేస్తానివాళ.'

'మళ్లీ ఏం జరిగిందండీ.'

'ఇలా'రాండి, మీకే తెలుస్తుంది' అంటూ లోపలికి నడిచిందామె. విశ్వనాథంగారు తప్పనిసరిగా ఆమె ననుసరించారు.

వరండాలోని కొయ్యకుర్చీ చూపి కూర్చో మని లోపలికి వెళ్లింది 'సరూ.'

విశ్వనాథంగారు కూర్చున్నారు. కుర్చీ చేతులమీద గరుకుగా తగిలితే అటు చూశారాయన. బ్లేడు గంట్లు !

'ఇదిగో చూడండి' ఆమె లోపల్నుంచి వచ్చింది. ఆమె చేతిలో రావుసైజు దళసరి కాగితం వుంది. ఆ కాగితంనిండా సిరా వొలికి వుంది.

'మోడరన్ ఆర్ట్ వేశారేంటి' నవ్వుతూ అన్నారాయన

ఆమె కూడా నవ్వింది. 'ఇది మీ శిష్యుడు చేసినపని. ఈ సిరా వెనకాల నేను నెల రోజులుగా కష్టపడి చిత్రించిన చిత్ర ముంది. నెలరోజులు ... సోమెనీ లాంగ్ అవర్స్ ..ఈ చిత్రాన్ని పోటీకీకూడా పంపుదా మనుకున్నాను. దాని మొహాన శిరాపోసి ఇలా చేశాడు. విధ్వంసక ప్రవృత్తికి మారు పేరండి వీడు' తన ఆవేదనను వెళ్ల గక్కిందామె.

'ఇదన్నమాట వాడు వెంటనే ఇంటికి రాకుండావున్న కారణం. పాపం, భయపడి వుంటాడు తనుచేసిన నేరానికి లభించ పోయే శిక్షను తలచుకొని. ఈసారికి వాడి నేమీ కొట్టకండి. మీరు మరోలా అనుకోక పోతే నాదొక సలహా. పిల్లలు తప్పులు చేయ డానికి కారణమేదో గ్రహించి వాళ్లా తప్పులు చేయకుండా చూడాలిగాని, కేవలం దండనద్వారానే వాళ్లలో మార్పు తేవాలను కోడం సరియైన పద్ధతి కాదేమో.'

ఆ మాటలని వెంటనే వచ్చేశారు విశ్వ నాథంగారు.

'గోపాల్ వింత ప్రవర్తనకు గట్టి కారణమేదో వుండివుండాలి. అది ఏమై వుంటుంది ?' అవి యోచిస్తూ నడక సాగించారు.

* * *

'పోతన్నా ..కపోతన్నా... అలా ముడుచుక పోయావేమోయ్! లే...మా బాబువు కదూ. నీకే .. మరేమో... శనగపప్పు కొనిపెట్ట మంటావా, బందరులడ్డు కొనిపెట్ట మంటావా? చెప్పరా పిచ్చినాన్నా. వీళ్లంతా

మనిషి మైనస్ మమత

వింటారని భయమా. సరేలే నా చెవులో చెప్పు...' చింపిరితల, మాసినబట్టలు పిచ్చివాలకంతోవున్న అతను పావురాయిని చేతుల్లోకి తీసుకుని ప్రేమగా, లాలనగా దాని రెక్కల్ని దువ్వటం మొదలెట్టాడు. అతను చూపుతున్న ఆప్యాయతకు పరవశించి పోతున్నదా అన్నట్లుగా ఆ పావురం అర మోడ్పుకన్నులతో 'గూ...గూ' మని తమాషాగా శబ్దం చేస్తోంది.

గోపాల్ చూపంతా ఆ పావురం మీదనే వున్నై. దాని పారవశ్యంలో తనూ తల మునకలవుతున్నాడు.

'ఒరే పోతన్నా నాకోముద్దు పెట్టరా.' అతనలా అడగటవే తడవుగా పావురం ఆ పిచ్చివాని భుజంమీదకు ఎగిరి అతని పెదాలకు తన తలను తాకించింది. అతను దాన్ని మళ్లీ చేతుల్లోకి తీసుకుని ముద్దు లతో ముంచేశాడు.

'ఎందుకు దాన్నలా ముద్దుపెట్టుకుం టావ్?' ఎవరో కుర్రాడు అడిగాడా పిచ్చి వాడ్ని.

'నీకేం నా కొడుకుని నేను ముద్దు పెట్టుకుంటే? నిన్ను మీ అమ్మా నాన్నా ముద్దుపెట్టుకోరూ ?' పిచ్చివాడు కళ్లు పెద్దవిచేస్తూ అన్నాడు.

గోపాల్ మొహంలో రంగులు మారినై. పిచ్చివాని మాటలు అతని ఆనందాన్ని భగ్నంచేసినై. అతను దోషిలా మెల్లగా అక్కడ్నించి కదిలాడు.

'పోతన్నా, మనం ఇక్కడుండొద్దు. నీ మీద నే చూపుతున్న ప్రేమను వీళ్లు చూళ్లేకుండా వున్నారు పోదాం పద' పిచ్చి వాడు కూడా పావురంతో ఆచోటు వదిలాడు.

'ఎవరో పాపం. పుత్రశోకంతో పిచ్చివా డైనట్లుంది, ప్చ్'... అరే! గోపాల్ ఏడీ? వీడికోసమే నేనిందాకటినుంచి నిల్చుంటే ... వీడూ మార్కెట్‌లోకే వెళ్తున్నాడే. ఆగరా నేనూ వస్తున్నాను' విశ్వనాథంగారు కూరల మార్కెట్‌వైపు నడిచారు.

* *

'గోపాల్! గోపాల్!!'

గోపాల్ పలుకలేదు. అతను ఎటో చూస్తున్నాడు దీక్షగా. గుమ్మం అవతల విశ్వనాథంగారి భార్య రాధమ్మ కూర్చొని వుంది. ఆమె తన వొడిలోని చిన్న పాపా యిని ఆడిస్తూ,

'చిరునవ్వు నవ్వే చిట్టిపాపాయి
సిబోసి నవ్వులే మా యింటి సిరులు'

అని పాడుతోంది. ఆపాట ఏమిటో తన కర్థమైనట్లు ఆ పాప నవ్వుతోంది. ఆ బోసినవ్వుల సిరులకు మురిసిపోయి పరవ శిస్తోందామె. ప్రక్కనే కూర్చున్న బాబు కూడా నవ్వుతున్నాడు. బాబుకి ఏదో అను మానమొచ్చి తల్లి నడిగాడు: 'అమ్మా చెల్లాయి పెద్దదైతే నీలాగా వుంటుందా నాన్నలాగా వుంటుందా?'

'నీకెలావుంటే ఇష్టం?'

'నీలాగే వుండాలమ్మా'

'మా నాయనే. నా వరాలతండ్రీ...' ఆమె బాబునికూడా ముద్దులతో ముంచివేసింది...

గోపాల్ చూస్తున్న ఆ దృశ్యాన్ని విశ్వ నాథంగారుకూడా చూశారు. గోపాల్ తన్మ యత్వమెందుకో గ్రహించారు. ఆయనకు నిన్న ప్రొద్దుటి సంఘటన జ్ఞాపకం వచ్చింది. గోపాల్ నిన్న పిచ్చివాడు పావు రాన్ని ఆప్యాయంగా దువ్వి ముద్దుపెట్టు కుంటుంటే ఎలా చూశాడో ఇప్పుడూ అలాగే చూస్తున్నాడు. తల్లి తన బిడ్డలపై వర్షించే ప్రేమామృతాన్ని ఆ దృశ్యంలో గోపాల్ చూస్తున్నాడని అర్థం చేసుకున్నారు విశ్వనాథంగారు.

'గోపాల్'

'ఏంటి మేష్టారూ?' గోపాల్ తన దృష్టిని మరల్చుకున్నాడు.

'నిన్నొక విషయం అడగనా?'

'అడగండి మేష్టారూ!'

'ఆరోజు మీ యింటికి స్కూటరుమీద వచ్చిందెవరు?'

'ఆరోజే కాదండి. రోజూ వస్తాడు.'

'అలాగా. ఎవరతను?'

'ఆమాటే నేను మా అక్కను అడిగా నండి.'

'ఏం చెప్పిందేం' కుతూహలంగా ప్రశ్నిం చారు విశ్వనాథంగారు.

'నీకెందుకు, నీపని నువ్వు చూసుకోమని కసిరిందండి.'

విశ్వనాథంగారు వెంటనే మాట్లాడలేదు. ఆయనలో ఆలోచనా తరంగాలు లేచినై ...

ఒక్కగా నొక్క తమ్ముడిమీద ఆ అక్క కెందుకో అంత కసి! వ్యక్తత తెలిసిన పెద్దలే

పిల్లల మనసుల్ని నొప్పించి వారి భవిష్య త్తును పాడుచేస్తున్నారు. గోపాల్ పుట్ట డమే తల్లిదండ్రుల మరణానికి హేతువని చదువుకుని ఉద్యోగంచేస్తున్న 'సరూ' నమ్మడమేంవిటి? 'అమ్మను చంపింది నువ్వే. నాన్నని చంపింది నువ్వే' అని పదే పదే గోపాల్‌ను దూషిస్తే అమ్మా, నాన్న బ్రతికొస్తారా? ఎదగని పసిమనసు అకారణ మైన ఆ దూషణకు తట్టుకోగలదా? పసి హృదయానికి కావలసిన మమత, వాత్సల్యం, లాలన కరువవడమే కాకుండా ఇలాంటి అకారణ దూషణలు ఎదుర్కోవలసి వచ్చి నపుడు, ఆ హృదయములో కసి, కర్కశత్వం పేరుకోడంలో ఆశ్చర్యమేం వుంది. ఆ కసి, కర్కశత్వం మాత్రమే గోపాల్‌చేత అలాంటి

మనిషి మైనస్ మమత

విధ్వంసక చర్యల్ని చేయిస్తున్నాయి.

'అయితే ఆరోజు అతని స్కూటరుకు గాలి తీసింది నీవేకదూ?'

విశ్వనాథంగారి ప్రశ్నకు గోపాల్ వెంటనే జవాబు చెప్పలేదు. తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు రెండుక్షణాలసేపు. ఆతర్వాత తల యెత్తాడు అతనికళ్లు తడిసి వున్నాయి.

'నిన్ను నేనే మనసు. నిజం చెప్పు' అనునయించారాయన.

'నేనే తీశాను సార్! ఆతను మా యింటికి రావడం నా కిష్టంలేదండి. అక్కకు నేనంటే ఇష్టం లేనప్పుడు అత నంటే నాకెందుకుండాలి గౌరవం? నేను తన జీవితానికి గుదిబండలా తయారయ్యా నని అన్నది కదా మా ఎదుటే!'

విశ్వనాథంగారు తల వంచుకున్నారు. 'సరూ! నీవు చేస్తున్న పని తప్పు. నీ 'ఫ్రెండ్'ను నీవు భర్తగా ఎన్నుకుని ఉండ వచ్చు. నేడో రేపో వివాహం చేసుకోవాలను కుంటుండవచ్చు. కాని నీ తమ్ముని, ఒక పసిహృదయాన్ని, మాతృప్రేమకు పితృ ప్రేమకు మరే ప్రేమకు నోచుకోని అభా గ్యుని నీదారికి అడ్డంగా ఊహించుకోడం ఆ విషయం అతనికి తెలిసేలా నీవు ప్రవర్తించడం క్షమించరానిది. తల్లిదండ్రుల తర్వాత వారి బాధ్యతను వహించవలసిన నీవే ఇలా ప్రవర్తిస్తుంటే, రేపు నిన్ను పెళ్లాడిన భర్త నీతమ్ముని ఉనికిని మాత్రం సహించగలడా? తప్పుచేస్తున్నది నీవు. శిక్ష అనుభవిస్తున్నదీ, అనుభవించేదీ నీ తమ్ముడు' విశ్వనాథంగారి మనసు ఆర్ద్ర మైంది.

'తప్పు, గోపాల్! మా అక్కకు నీవంటే ఇష్టం లేకపోవడమేంవిటి. మా అక్కకు నీవంటే ఎక్కువ ఇష్టం కనుకనే నీ వెప్పుడూ బాగా చదువుకోవాలనీ, తప్పు పనులు చేయకుండా వుండాలని చెప్తుం టుంది. నీ శ్రేయస్సును కోరేవాళ్లేగదా, నిన్ను మంచిమార్గంలో పెట్టాలని ప్రయ త్నించేది!'

తను చెప్పింది నిజం కాదని తెలుసు విశ్వ నాథంగారికి. కాని, తప్పదు. అబద్ధ మాడాలి. కృంగిపోతున్న అతనిలో రవ్వంత ఆశను రగిలించాలి. అతనిలోని నిస్పృహను పారద్రోలాలి. అతని మనసుకు ఊరట కలి గించాలి!

విశ్వనాథంగారికిప్పుడు తృప్తిగా వుంది. తనకిప్పుడు గోపాల్ అర్థమైనాడు. అర్థ మైనాడు కాబట్టి అతనిలో మార్పు తీసుక వచ్చి అతడ్ని మనిషిగా తీర్చిదిద్దటం ఇహ తేలికే. తన ఈ ప్రయత్నానికి 'సరూ'కూడా చేయూతనిస్తే తనకెక్కువ శ్రమ ఉండదు. 'రేపు 'సరూ'ని కలుసుకుని గోపాల్ ప్రవర్తనకు కారణం నీవేనని చెప్పి, తన తప్పిదాన్ని దిద్దుకోమని చెప్పాలనుకున్నారు. గోపాల్‌పట్ల ఆమె ప్రవర్తన మారనిది అతనిలో మార్పు రాదు. అవును, దీపం వెలగాలంటే నూనే పోయాలి, నీరుకాదు. ●